సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 30 । ఆగస్టు । 2023



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
యాదగిరిగుట్ట మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. - 9లో



బీజేపీని నిలువరించడమే..
బీజేపీని నిలువరించడమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. -10లో



అర్చకులకు తీపి కబురు
ధూప దీప నైవేద్య పథకం కింద అర్చకులకు అందించే గౌరవ వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. - 10లో

న్యూస్‌రీల్

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



సంఘీభావం తెలుపుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నారాయణరెడ్డి

భువనగిరిటౌన్: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత పద్నాలుగు రోజులుగా కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఏఎన్‌ఎం పోస్టులకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా రెండో ఏఎన్‌ఎంలు సేవలు అందించారని తెలిపారు. అలాంటి వారిని ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. వారికి న్యాయం జరిగే వరకూ అవసరమైతే ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇంటిని ముట్టడించడానికి బీజేపీ తరఫున పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండవ ఏఎన్‌ఎంల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవు



వివరాలు నమోదు చేసుకుంటున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి

చౌటుప్పల్: నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్‌కళ్యాణ్, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి హెచ్చరించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పలు హోటళ్లు, కిరాణ దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. హోటళ్ల నుంచి ఆహార శాంపిళ్లు సేకరించారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహారం విషయంలో ఏ మాత్రం కల్తీకి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారపదార్థాల తయారీదారులు, విక్రయదారులు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్సు తీసుకోవాలని, లేనిపక్షంలో రూ.లక్ష రూపాయల వరకు జరిమానా పడుతుందని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మధుకర్

భువనగిరి : క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సంఘటన మంత్రి మధుకర్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. బూత్ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నంద కుమార్ యాదవ్, పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, గూడూరు నారాయణరెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, పడాల శ్రీనివాస్, నర్ల నర్సింగ్‌రావు, నరందర్, వీరారెడ్డి, సీఎన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాచకొండ కృష్ణ, పాదరాజు ఉమాశంకర్, చందా మహేందర్ గుప్తా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమికి అదనపు బస్సులు

యాదగిరిగుట్ట: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో నుంచి అదనపు బస్సులను నడిపిస్తామని డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్, ఉప్పల్, తిరుమలగిరి రూట్లలో ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా మహిళా ప్రయాణికుల కోసం భువనగిరి, యాదగిరిగుట్ట బస్‌స్టేషన్‌లలో గిఫ్టు బాక్స్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

విచ్చలవిడిగా మైనింగ్

- రుణమాఫీ అందడం లేదు
- పింఛన్ల మంజూరులో జాప్యం
- రైతు వేదికలు వృథాగా మారాయి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ప్రస్తావన

సాక్షి, యాదాద్రి: జిల్లాలో మైనింగ్‌పై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడి చర్చ జరిగింది. మైనింగ్ విచ్చలవిడిగా సాగుతోందని, రైతు రుణమాఫీ అమలు కావడం లేదని, రైతు వేదికలు వృథాగా మారాయని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆత్మకూర్(ఎం) జెడ్పీటీసీ సభ్యుడు నరేందర్ గుప్తా మాట్లాడుతూ రైతు రుణమాఫీ అయినట్లు రైతులకు తెలియడం లేదన్నారు. చాలాకాలంగా బ్యాంకు అకౌంట్ ఉపయోగించకపోవడంతో అకౌంట్స్ బ్లాక్ అవుతుండడంతో రుణమాఫీ విషయం రైతులకు తెలియడం లేదన్నారు. వ్యవసాయ అధికారులు ఏఈఓలకు గ్రామాలకు పంపించి ఏ రైతుకు ఎంత రుణమాఫీ జరిగిందనేది రైతులకు వివరించాలని తెలిపారు.

బ్లాస్టింగ్‌లతో ఇళ్లు కూలిపోతున్నాయి..
విచ్చలవిడిగా మైనింగ్ అనుమతులు ఇచ్చారని, బ్లాస్టింగ్‌లతో ఇళ్లు కూలిపోతున్నాయని జెడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, చౌటుప్పల్ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగితే ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేవలం మూసీ పరీవాహక ప్రాంతంలో మాత్రమే పంటలు పండుతున్నాయని, వర్షాలు సరిగ్గా పడకపోవడంతో మిగతా ప్రాంతాల్లో పండడం లేదని సభ్యులు తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

జిల్లాను కరువు జిల్లా ప్రకటిస్తూ తీర్మానం చేస్తే కరువు నిధులు వస్తాయని జెడ్పీటీసీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి స్పందిస్తూ ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో అధిక మొత్తంలో ధాన్యం పండించినట్లు గుర్తు చేశారు.

వృథాగా రైతు వేదికలు..
జెడ్పీఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు వృథాగా మారాయని అన్నారు. ఈ వేదికల్లో ఎక్కడా రైతులకు అవగాహన కల్పించడం లేదన్నారు. జిల్లాలో కల్తీపాల దందా విచ్చలవిడిగా సాగుతుందన్నారు. బస్వాపురం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులందరికీ మత్స్యశాఖ సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

వెంకటస్వామి డిమాండ్ చేశారు. మత్స్యశాఖ జిల్లా అధికారి రాజారాం స్పందిస్తూ కేవలం ముదిరాజులు, గంగపుత్రులకు మాత్రమే సభ్యత్వం ఇస్తామని చెప్పారు. ఆసరా పింఛన్ల జారీలో జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూర్ ఎంపీపీ తండ మంగమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖలీల్ కోరారు. కలెక్టర్ స్పందిస్తూ స్లాట్ బుకింగ్ యూనిట్లు పెంచే అవకాశంపై పరిశీలిస్తామని తెలిపారు. ఒకేసారి మూడు నెలలకు సరిపడా యూనిట్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓ, డీసీహెచ్‌ఓను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీసీఈఓ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందాలి
సంక్షేమ పథకాలు అందరికీ చేరేవిధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో గత అనుభావాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. గత సీజన్‌లో జిల్లాలో ధాన్యం ఎక్కువగా రావడంతో రైతులు కొంత ఇబ్బంది పడ్డారని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. అధికారులు పేదలను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో వ్యవహరిస్తే సమస్యలు జెడ్పీ వరకు రావని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆశావహులు.. 130 మంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం భారీ సంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 130కి చేరింది. అందులో అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి 23 మంది దరఖాస్తు చేసుకోగా, మిర్యాలగూడ నుంచి 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత స్థానంలో నకిరేకల్ ఉండగా.. అక్కడ 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆలేరులో 17 మంది, దేవరకొండలో పది మంది దరఖాస్తు చేసుకున్నారు. మిగతా నియోజకవర్గాల్లో ఇద్దరి నుంచి మొదలుకొని ఏడుగురు వరకు దరఖాస్తు చేసుకున్నట్లు టీపీసీసీ ఎన్నికల కమిటీ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులకు టీపీసీసీ అందజేసింది. జిల్లా నుంచి ఆ కమిటీలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తుల వివరాలు

నియోజకవర్గం	దరఖాస్తులు		
తుంగతుర్తి	23	నల్లగొండ	7
మిర్యాలగూడ	20	హుజూర్‌నగర్	7
నకిరేకల్	18	సూర్యాపేట	6
ఆలేరు	17	కోదాడ	5
భువనగిరి	11	మునుగోడు	4
దేవరకొండ	10	నాగార్జునసాగర్	2
		మొత్తం	130

ఉద్యోగులకు టైమ్ స్కేల్ అమలు చేయాలి

భువనగిరిటౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగ పాండరి, దొమ్మాట భాస్కర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో గత 15- 20 సంవత్సరాలుగా పనిచేస్తూ అతి తక్కువ వేతనాలు తీసుకుంటున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు టైం స్కేల్ సాధించేవరకు నిరంతరం ఉద్యమాలు చేస్తామన్నారు. బుధవారం కూడా రిలే దీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారిలో జేఏసీ కోశాధికారి శ్రవణ్, రవిప్రసాద్, విజయ్ కుమార్ స్వామి, యాకయ్య, లింగస్వామి, తిరుపతి, కృష్ణ, బాలయ్య, నందకిషోర్, పరుశరాములు, స్వామి ఉన్నారు.

జనాభా ప్రాతిపదికన పథకాలు అమలు చేయాలి

మోత్కూరు: ప్రస్తుతం ఉన్న ఎస్సీ జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలను అమలు చేయాలని పాటిమట్ల గ్రామానికి చెందిన దళితులు మంగళవారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత బంధు పథకాన్ని గ్రామంలోని దళితులందరికీ వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నాకు సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గుండు వెంకటనర్సు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు బుర్ర శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మందుల సురేష్‌లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కురుమేటి యాదమ్మ, తాళ్లపల్లి రామక్క, రాంపాక రాజమ్మ, అన్నెపర్తి పుష్పమ్మ, భూలక్ష్మి, పూలమ్మ, ఎల్లమ్మ, యాదమ్మ, సైదమ్మ, పాండమ్మ, జ్యోతి, సుగుణమ్మ, అరుణ, వరమ్మ, పద్మ, యాదయ్య, ఎల్లయ్య, సోమయ్య పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పాటిమట్ల గ్రామ దళితులు

క్రీడలతో ఐక్యత పెరుగుతుంది

- డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: క్రీడలతో క్రీడాకారుల మధ్య ఐక్యత పెరుగుతుందని డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చలో మైదాన్ నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ రాజేష్‌చంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలన్నారు. ఆటలు ఫోన్లలో కాకుండా మైదానంలో ఆడాలన్నారు. క్రీడలతో ఉద్యోగ రిజర్వేషన్ అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన చలో మైదాన్ కార్యక్రమం ద్వారా ఆసక్తి కలిగిన క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలను కూడా జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులను తమ పిల్లలను చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం త్వరలోనే స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసే అవకాశం ఉందన్నారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

అంతకుముందు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూడో క్రీడాకారులతో తైక్వాండో ప్రదర్శన నిర్వహించారు. రమేష్ రాజ్, భరత్‌డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య, ఆర్డీఓ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, డీఐఈఓ రమణి, ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కృష్ణమూర్తి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ గోపాల్, నాగయ్య, గుర్రం కృష్ణ, పాండు రంగం, కరుణ్, పీఈటీలు పాల్గొన్నారు.

తగ్గిన గ్యాస్ సిలిండర్ ధర



భువనగిరిలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

- సాధారణ సిలిండర్ ధర రూ. 200, ఉజ్వల పథకం సిలిండర్లకు రూ.400 తగ్గింపు
- జిల్లాలో 3,11,415 మంది గ్యాస్ వినియోగదారులకు లబ్ధి

భువనగిరి: రక్షా బంధన్‌ను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించింది. సాధారణ గ్యాస్ సిలిండర్ ధర రూ. 200లు, ఉజ్వల పథకం కింద సిలిండర్లకు రూ.400లు తగ్గించింది. తగ్గించిన ధరలు బుధవారం నుంచి అమలులోకి రానున్నాయి. కాగా.. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1200లు ఉంది.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు ఇలా..
జిల్లాలో మొత్తం 3,11,415 గ్యాస్ కనెక్షన్స్ ఉన్నాయి. ఇందులో జనరల్ కనెక్షన్స్ 2,51,737 ఉండగా దీపం పథకం కింద 46,666, ఉజ్వల పథకం కింద 13,012 మంది వినియోగదారులు ఉన్నారు. గ్యాస్ సిలిండర్ ధర తగ్గించడంతో వీరందరికీ లబ్ధి చేకూరనుంది.

సామాన్యులకు సంతోషకరం



ప్రస్తుతం గ్యాస్‌సిలిండర్ ధర తగ్గించడం సంతోషకరమైన విషయం. రెండు నెలలకు ఒక సిలిండర్ వస్తుంది. దీంతో రెండు నెలలకే రూ. 1200లు చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం సిలిండర్‌పై రూ. 200లు తగ్గించడం సంతోషకరం. పేద వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– గోద భవాని, బొల్లెపల్లి, భువనగిరి మండలం

ఇంకా తగ్గించాలి



ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్ పై ప్రభుత్వం రూ. 400 రాయితీ ఇస్తూ కేంద్రం ప్రకటించింది. ఈ విషయం పేద ప్రజలకు సంతోషాన్ని కలిగించే విషయం. కానీ ప్రస్తుతం గ్యాస్ సిలిండర్‌కు ఉన్న ధర చెల్లించలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉజ్వల గ్యాస్ సిలిండర్ ధరతోపాటు, జనరల్ గ్యాస్ సిలిండర్ ధర ఇంకా తగ్గిస్తే మేలు చేకూరుతుంది.
– గాజుల గీత, రాయపల్లి, ఆత్మకూర్(ఎం) మండలం

మరమరాలు.. C/O కట్టంగూర్

టైంపాస్‌కు ఏదైనా తినాలని అనిపిస్తే వెంటనే గుర్తొచ్చేవి మరమరాలు. గుప్పెడు మరమరాలకు సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, కొంచెం నూనె, కారం, వేయించిన పల్లీలు వేసి కలుపుకుని తింటే ఆ అనుభూతి చెప్పనలవి కాదు. ఇంటికొచ్చే అతిథులకు సైతం కరకరలాడే మరమరాలను స్నాక్స్‌గా అందించవచ్చు. ఇప్పుడు మరమరాలతో రకరకాల రెసిపీలు తయారు చేస్తున్నారు. మన రాష్ట్రంలోనే కాదు.. పక్కనున్న ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలోనూ మరమరాలకు ఫుల్ క్రేజ్ ఉంది. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మధుమేహ వ్యాధి గ్రస్తులు సైతం వీటిని నేరుగా తినొచ్చు. వీటి తయారీకి కేరాఫ్‌గా నిలుస్తోంది కట్టంగూర్. – నల్లగొండ డెస్క్





- 80 ఏళ్ల క్రితం కుటీర పరిశ్రమగా మొదలు
- ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి
- వివిధ బ్రాండ్‌ల పేరుతో హైదరాబాద్ మార్కెట్‌లో విక్రయం
- సిద్దిపేటలోని పరిశ్రమలూ కట్టంగూర్ వాసులవే..

కట్టంగూర్‌లో 80 సంవత్సరాల క్రితం కుటీర పరిశ్రమగా మరమరాల తయారీ ప్రారంభమైంది. పద్మశాలీలు ప్రారంభించిన ఈ కుటీర పరిశ్రమను గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు చేపట్టారు. మొదట్లో సుమారు 50 కుటుంబాల వారు బట్టీల ద్వారా మరమరాలు తయారు చేసేవారు. 30 సంవత్సరాల నుంచి బట్టీల స్థానంలో మిషన్లు (రోస్టర్లు) వచ్చాయి. అయితే.. రానురాను ముడి సరుకుల ధరలు పెరగడం, పెద్దగా లాభాలు లేకపోవడంతో చాలా **కుటుంబాలు** మరమరాల పరిశ్రమకు దూరమయ్యాయి. బట్టీల విధానం ఉన్నప్పుడు.. అంటే 1995 సంవత్సరం వరకు కట్టంగూర్‌లో సుమారు వంద బట్టీలు ఉండేవి. ఒక్కో ఇంట్లో రెండు బట్టీలను కూడా నడిపారు. అయితే, దుమ్ము, పొగ కారణంగా మరమరాల పరిశ్రమలు గ్రామానికి దూరంగా వచ్చాయి. ప్రస్తుతం పది మిల్లులు ఉన్నాయి. వీటిలో రోస్టర్, ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన మిల్లుల్లో మరమరాలు తయారవుతున్నాయి.

సిద్దిపేటలోనూ మనవారే..
కట్టంగూర్‌కు చెందిన వారే సిద్దిపేటలో మరమరాల పరిశ్రమను విస్తరించారు. ఆ జిల్లాలో మొక్కజొన్న పంట ఎక్కువగా ఉంటుంది. అక్కడ మక్కల అటుకులు, పోహ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. దానికి అనుబంధంగా 15 మరమరాల మిల్లులు కూడా ఏర్పాటు చేశారు.

ఇతర రాష్ట్రాల్లోనూ మార్కెటింగ్
కట్టంగూరులో తయారైన మరమరాలను **తెలంగాణ,** ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటక, మహారాష్ట్రలో మార్కెటింగ్ చేస్తున్నారు. కట్టంగూర్ నుంచి నేరుగా వివిధ ప్రాంతాలకు సరఫరా ఉంటుంది. 50 శాతం తెలంగాణలో మార్కెటింగ్ జరిగితే.. మిగతా అన్ని ప్రాంతాల్లో కలిపి 50 శాతం విక్రయం ఉంటోంది. వివిధ బ్రాండ్ల పేరుతో హైదరాబాద్‌లో విక్రయాలు జరుపుతుంటారు. మహారాష్ట్రలో దీపావళి పండుగ సమయంలో మరమరాల వినియోగం అధికంగా ఉంటుంది. అంతటా మరమరాల ధర సమానంగానే ఉంటున్నప్పటికీ ట్రాన్స్‌పోర్ట్ చార్జీలతో కలిసి వాటి ధర నిర్ణయిస్తారు. దూర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నప్పుడు రవాణా చార్జీలు కూడా కలుపుతారు. మరమరాలను కర్నాటక రాష్ట్ర ప్రజలు ఉదయం అల్పాహారంలో ఎక్కువ తీసుకుంటారు. తెలంగాణలో చూస్తే.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరమరాల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఆ జిల్లాలోని ప్రతి చిన్న గ్రామంలోనూ మరమరాలు దొరుకుతాయి.



మరమరాలు ప్యాకింగ్ చేస్తున్న తయారీదారులు



మరమరాలు తయారు చేసే అధునాతన మిల్లు

ప్రభుత్వం సహకారం అందించాలి



మరమరాల పరిశ్రమకు ప్రభుత్వ సహకారం కావాలి. ధాన్యం సంవత్సరంలో మూడు నెలలే ఉంటుంది. మా పరిశ్రమకు సంవత్సరానికి సరిపడా ధాన్యాన్ని ఒకేసారి కొనుగోలు చేయాలంటే ఎంతో ఆర్థిక భారం అవుతుంది. ఐకేపీ కేంద్రాల ద్వారా సబ్సిడీపై ధాన్యం సరఫరా చేయాలి. బ్యాంకుల ద్వారా ఓడీ సౌకర్యం కల్పించాలి. ఈ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకుంటే మరింత అభివృద్ధి చెందుతుంది. మరికొందరు మరమరాల పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తారు.
– గంజి వెంకన్న, మరమరాల మిల్లు యజమాని, కట్టంగూర్

ధాన్యం కేటాయించాలి



ఐకేపీ ధాన్యాన్ని రైస్ మిల్లులకు కేటాయిస్తున్న విధంగా.. మాకు కూడా ధాన్యం కేటాయించాలి. మేము అందుకు నగదు చెల్లిస్తాం. పరిశ్రమ ఏర్పాటు చేసుకుంటున్నప్పుడు చిన్న తరహా పరిశ్రమల కింద సబ్సిడీ రుణాలు ఇస్తున్నా.. వ్యాపారానికి కూడా రుణం ఇవ్వాలి. బ్యాంకుల ద్వారా ఓడీ ఇవ్వాలి. విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి. మా పరిశ్రమలకు 24 విద్యుత్ సౌకర్యం కల్పించాలి.
– రాపోలు వెంకటేశ్వర్లు, మరమరాల తయారీదారుడు, కట్టంగూర్

మరింత ప్రోత్సాహం అవసరం



1010 రకం ధాన్యం క్వింటా రూ.2500 ఉందని.. ధాన్యం ధర పెరగడం వల్ల తమకు గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు. రోస్టర్‌లో వాడుతున్న సముద్రపు ఇసుక టన్ను ధర రూ.2500 పలుకుతుంది. ఇసుకను మచిలీపట్నం నుంచి తెప్పించుకుంటున్నారు. క్వింటా మరమరాల ఉత్పత్తికి 10 కిలోల సముద్రపు ఇసుక అవసరం. ఒక క్వింటా మరమరాలు తయారయ్యే ప్రక్రియకు.. వేడి నీళ్ల కోసం మండించే కట్టె పొట్టు, ఇసుక, ఉప్పుకు కలిపి రూ.250 ఖర్చు వస్తుంది. దీనికి ధాన్యం ధర అదనం.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి


లచ్చయ్య(ఫైల్)

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. జాజిరెడ్డిగూడెం మండలంలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తొండల లచ్చయ్య(48) గ్రామ శివారులో నిత్య ఫిల్లింగ్ స్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24 రాత్రి లచ్చయ్య విధుల్లో ఉండి 10–30 గంటల సమయంలో భోజనం కోసమని ఫిల్లింగ్ స్టేషన్ నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన వ్యక్తిని తప్పించబోయి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమార్తె నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

సూర్యాపేట క్రైం : చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేటలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ధనంబొడ్డు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కోటి సూర్యం (35) హైదరాబాద్ నుంచి లారీలో సిమెంటు లోడు వేసుకొని సోమవారం కోదాడకు బయలుదేరారు. అదే రోజు రాత్రి సూర్యాపేటలోని రోడ్డు పక్కన తన సిమెంటు లోడ్ లారీని ఆపి సూర్యాపేటలోని సద్దుల చెరువులోకి స్నానం చేసేందుకు దిగాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు కాలుజారీ చెరువులో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి భార్య విజయకుమారి తన భర్తకు ఈత రాకపోవడంతో చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

నూతనకల్ : కుటుంబ తగాదాల నేపథ్యంలో ఘర్షణ పడిన ఇరువర్గాలపై మంగళవారం నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నూతన్‌కల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన సోదరులు లింగాల వెంకటయ్య, లింగాల అంజయ్య కుటుంబ సభ్యులు పరస్పరం దాడులు చేసుకోవడంతో గాయాలయ్యాయి. ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సలిగంటి నరేష్ తెలిపారు. గాయపడిన వారు సూర్యాపేట, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు


స్వాధీనం చేసుకున్న పూజ సామగ్రి

భువనగిరి : భువనగిరి పట్టణంలోని ఓ ఇంట్లో మంగళవారం గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రెడ్డివాడకు చెందిన రఘుపాల్ సింగ్ నివాసంలో మూడు రోజులుగా పూజలు జరుపుతున్నారు. మధ్యాహ్న సమయంలో రఘుపాల్‌సింగ్ ఇంట్లోనే మరో నలుగురు కూలీలతో కలసి తవ్వకాలు ప్రారంభించాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆ ఇంటిపై దాడి చేసి తవ్వకాలకు ఉపయోగిస్తున్న పనిముట్లతో పాటు కట్టింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. తవ్వకాలకు పాల్పడుతున్న ఇంటి యాజమానితో పాటు కూలీలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌ను అరెస్టు చేయాలి


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న జానయ్య బాధితులు

- జాతీయ రహదారిపై బాధితుల ఆందోళన

సూర్యాపేట రూరల్ : భూములను ఆక్రమించి, గన్‌తో చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌ను అరెస్ట్ చేయాలని పలువురు బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు జానయ్య బాధితులు మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో హైవేపై ధర్నా నిర్వహించారు. జానయ్య యాదవ్‌తో తమకు ప్రాణహాని ఉందని వాపోయారు. మా భూములు ఆక్రమించిన జానయ్య యాదవ్‌ను అరెస్టు చే,సి రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. అనంతరం సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఉగ్గం బుచ్చిరాములు, పాలవరపు వేణు, శేఖర్, శంకర్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

మహిళను బెదిరించి..

మహిళను బెదిరించి రూ.40లక్షలు వసూలు చేశాడని డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌పై మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ సాయిరాం తెలిపారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని బాషనాయక్ తండాకు చెందిన ధోనికెనే స్వాతికి ఆమె భర్తకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆ పంచాయతీని ఆసరాగా చేసుకొని ఆమెను వట్టే జానయ్య తుపాకీతో బెదిరించి మొదటగా రూ. 8లక్షలు తీసుకున్నాడు. తిరిగి ఆమె వద్ద రూ.40లక్షలు ఇవ్వకుంటే ఇంటిని ఆక్రమించుకుంటానని జానయ్య యాదవ్ అతని అనుచరులు బెదిరించారని స్వాతి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దంపతులను కిడ్నాప్ చేసి..

- రూ.30లక్షలు వసూలు
- డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, అతని కొడుకుపై కేసు

సూర్యాపేట రూరల్ : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన దంపతులను కిడ్నాప్ చేసి రూ. 30లక్షలు వసూలు చేశారనే ఫిర్యాదు మేరకు డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, అతని కుమారుడు వట్టే గణేష్‌పై సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన వేముగంటి చక్రవర్తి–మమత దంపతులు పెట్రోల్ బంకుకు సంబంధించిన అన్ని శాఖల అనుమతి కోసం డాక్యుమెంట్లు తయారు చేస్తారు. గాంధీనగర్‌కు చెందిన వట్టె జానయ్య యాదవ్, విజయవాడకు చెందిన మూర్తితో అగ్రికల్చర్ సొసైటీకి సంబంధించిన పెట్రోల్ బంకు పర్మిషన్ గురించి అగ్రిమెంటు చేసుకొని రూ. 30లక్షలు మూర్తి చెల్లించారు. అగ్రిమెంటు మూర్తితో జరిగింది. కానీ జానయ్య యాదవ్ అతని కుమారుడు గణేష్‌చక్రవర్తి దంపతులను డబ్బులు కట్టమని బెదిరించారు. వారితో అగ్రిమెంటు రాయించి చక్రవర్తి దంపతుల నుంచి రూ. 25లక్షలు వసూలు చేశారు. కొన్ని రోజుల తర్వాత వట్టె గణేష్ తన అనుచరులతో కూకట్‌పల్లికి వెళ్లి మమతను బెదిరించి ఆమెకు సంబంధించిన కారులోనే గాంధీనగర్‌కు తీసుకువచ్చి డబ్బులు కట్టమని బెదిరించారు. జానయయ్య యాదవ్‌కు భయపడి మొత్తం రూ. 30లక్షలు చెల్లించారు. కాగా మమతకు కారు ఇవ్వాలంటే అదనంగా రూ. 5లక్షలు ఇవ్వమన్నారని తెలిపారు. చక్రవర్తి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసు ఉపసంహరించుకుంటే పదోన్నతి కల్పిస్తాం

- ప్రతిఫలంగా కాంట్రాక్టులూ ఇస్తాం
- మిర్యాలగూడ డీఈ ప్రలోభపెట్టారని లైన్‌మన్ గుంటూరు శ్రీనివాస్ ఆరోపణ
- లైన్‌మన్ ఆరోపణలు అవాస్తవమన్న డీఈ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న లైన్‌మన్ శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్ : ట్రాన్స్‌కో డీఈ మురళీధర్‌రెడ్డిపై పెట్టిన ఏసీబీ కేసును ఉపసంహరించుకుంటే ప్రతిఫలంగా పదోన్నతి కల్పించడంతో పాటు కాంట్రాక్టులూ ఇస్తామని ట్రాన్స్‌కో మిర్యాలగూడ ప్రస్తుత డీఈ వెంకటేశ్వర్లు ఒత్తిడి చేస్తున్నారని లైనమన్ గంటూరు శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం మిర్యాలగూడలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో లైన్‌మన్ విలేకరులతో మాట్లాడారు. గత డీఈ మురళీధర్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదయ్యాక తనకు రావలసిన ప్రోత్సాహకాలు అందాయని, పదోన్నతిని మాత్రం అడ్డుకున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. పదోన్నతి విషయం మాట్లాడేందుకు ఇటీవల డీఈ వెంకటేశ్వర్లును కలిసానని తెలిపారు. ఆ సందర్భంలో డీఈ తనను ప్రలోభాలకు గురిచేశాడని ఆరోపించారు. పదోన్నతి విషయం అడిగితే కేసును విత్ డ్రా చేసుకోమని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. లైన్‌మన్ శ్రీనివాస్ చేసిన ఆరోపణలను డీఈ వెంకటేశ్వర్లు ఖండించారు. ఇటీవల తనను పదోన్నతి విషయంపై శ్రీనివాస్ కలిసిన మాట వాస్తవమేనని తెలిపారు. ఆయన చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని డీఈ కొట్టిపారేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


కుటుంబ సభ్యులతో నవ్య,ప్రకాష్

కనగల్ : ఇంట్లో నుంచి వెళ్లి పోయి ప్రేమికుడిని వివాహం చేసుకున్న ఓ యువతి రక్షణ కల్పించాలని కోరుతూ మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. కనగల్ మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన దండు నవ్య ఈ నెల 25న దృశ్యమైన విషయం తెలిసిందే. మూడు రోజులైనా కూతురు కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన నవ్య అదే రోజు మునుగోడు మండల పరిధిలోని లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన ప్రకాష్‌ను చండూరు పట్టణంలోని మార్కండేయ ఆలయంలో వివాహం చేసుకుంది. ఈ క్రమంలో మంగళవారం నవ్య ఆమె భర్త ప్రకాష్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఇష్టంతోనే వివాహం చేసుకున్నామని, రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు రెండు కుటుంబాల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి నవ్యను ఆమె భర్త ఇంటికి పంపించారు. నవ్యప్రకాష్‌లు ప్రస్తుతం నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని శాసనమండల చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాండ్ర గ్రామంలో రూ.2.10 కోట్లతో నిర్మించే సబ్ మార్కెట్ యార్డ్, రూ.82.5 లక్షలతో నార్కట్‌పల్లి– మాండ్ర వయా చొటబాయి బీటీ రోడ్డు మరమ్మతు పనులకు ఆయన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ ముచ్చటగా మూడో సారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్ట అమలు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధి కోసం సీఎం, మంత్రి సహకారంతో అధిక నిధులు తానే తెచ్చానని తెలిపారు. యూట్యూబ్‌లో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మ వద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచ్ దొండ సొమ్మరమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, వైస్ చైర్మన్ కొండూరి శంకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు భద్రాచలం, బాదం వరలక్ష్మి, రామిరెడ్డి, యానాల మాధవి, ఎంపీటీసీలు చిరుమర్తి యాదయ్య, మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, సైదులు, రవి, నలగొండ అగ్రికల్చర్ డీఈ కరుణాకర్‌రెడ్డి, ఏఈ వి.అశోక్, సెక్రటరీ ఆర్ జానయ్య, సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్, వెంకన్న తదితరులు ఉన్నారు.

ఒకరికి మూడు రోజుల జైలు

మునుగోడు: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నల్లగొండ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మునుగోడు మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన కృష్ణయ్య కొద్ది రోజుల క్రితం మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. మంగళవారం అతడిని నల్లగొండ కోర్టుకు తరలించగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు నల్లగొండ న్యాయస్థానం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏటీఎంలలో డబ్బులు పెట్టకుండా రూ.1.37కోట్లు స్వాహా

భువనగిరి : ఏటీఎంలలో డబ్బులు పెట్టకుండా ఇద్దరు ఘనులు రూ.1.37కోట్లు స్వాహా చేశారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరికి చెందిన రాము, రాయగిరికి చెందిన నగేష్ రైటర్స్ ఏజెన్సీలో ఎటీఎంలలో డబ్బులు పెట్టే సిబ్బందిగా పనిచేస్తున్నారు. వీరు భువనగిరి పట్టణంతో పాటు యాదగిరిగుట్ట, వంగపల్లి, బ్రాహ్మణపల్లితో పాటు భువనగిరి చట్టు పక్కల ఉన్న అన్ని రకాల బ్యాంకుల ఏటీఎంలో ఏజెన్సీ ద్వారా డబ్బులు పెట్టేవారు. రెండేళ్లుగా వీరు ఏటీఎంలలో పెట్టాల్సిన డబ్బులు పూర్తిగా పెట్టకుండా రూ. 1.37 కోట్లు స్వాహా చేశారు. ఈ నెల 26న స్వయంగా వారు ఏజెన్సీ నిర్వాహకులకు విషయాన్ని తెలిపారు. దీంతో ఏజెన్సీ ప్రతినిధి వెంకటకిరణ్ భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. 26న రాము, నగేష్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ. 5 లక్షలను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.

ఎంజీయూ అధ్యాపకుల సమ్మె నోటీస్


వీసీకి సమ్మె నోటీస్ అందజేస్తున్న కాంటాక్ట్ అధ్యాపకులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణారావుకు సమ్మె నోటీస్ అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీల్లో సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్లను రెగ్యులరైజ్ చెసినట్లుగా తమను కూడా రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మె నోటీస్ అందజేసిన వారిలో దండ రవీందర్‌రెడ్డి, అమరేందర్, భిక్షం, రమేష్, రామచంద్రయ్య, మశ్చేందర్, మధు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, మౌని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంది వీరే..

నల్లగొండ
1. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
2. దుబ్బాక నర్సింహారెడ్డి
3. డాక్టర్ చెరుకుసుధాకర్
4. డాక్టర్ మల్లెబోయిన అంజనేయులు
5. తండు సైదులుగౌడ్
6. నూనెకోటి
7. వనమాల రమేష్‌నేత

నకిరేకల్
1. కొండేటి మల్లయ్య
2. దైద రవీందర్
3. నలగాటి ప్రసన్నరాజ్
4. పెరిక వెంకటేశ్వర్లు
5. సికిలం అరుణ్‌కుమార్
6. దైద స్వప్న
7. పోకల దేవదాస్
8. వంగూరి లక్ష్మయ్య
9. నకిరేకంటి వెంకటేశ్వర్లు
10. వేదాసు వెంకయ్య
11. వేదాసు శ్రీధర్
12. ఏర్పుల యాదగిరి
13. దోసపాటి విజయ్ కిషోర్
14. పెరుమాళ్ల శేఖర్
15. అనుములపురి వెంకటశివరాజీవ్
16. మేడి రవిచంద్ర
17. తక్కెళ్ల జంగయ్య
18. నేత కాని కిష్టయ్య

మునుగోడు
1. పాల్వాయి స్రవంతి
2. చలమల్ల కృష్ణారెడ్డి
3. డా. బైకాని లింగం యాదవ్
4. పున్న కైలాస్‌నేత

మిర్యాలగూడ
1. కుందూరు రఘువీర్‌రెడ్డి
2. పగిడి రామలింగయ్యయాదవ్
3. ముదిరెడ్డి నర్సిరెడ్డి
4. బత్తుల లక్ష్మారెడ్డి
5. అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి
6. చిరుమర్రి కృష్ణయ్య
7. గోపగాని మాదవి
8. జటంగి వెంకటనర్సయ్య
9. చిలుకూరి బాలకృష్ణ
10. గుండు నరేందర్‌గౌడ్
11. కొర్ర నాగునాయక్
12. కెతావత్ శంకర్‌నాయక్
13. కర్నాటి నాగేంద్రప్రసాద్
14. ముత్తినేని వీరయ్య
15. చల్లా తేజ వీరవెంకట సత్యనారాయణ
16. నూకల వేణుగోపాల్‌రెడ్డి
17. పుట్టల కృష్ణయ్య
18. తమ్మడబోయిన అర్జున్
19. బెజ్జం సైదులు
20. ఎండి.జానిపాషా

నాగార్జునసాగర్
1. కుందూరు రఘువీర్‌రెడ్డి
2. కుందూరు జైవీర్‌రెడ్డి

దేవరకొండ
1. నేనావత్ బాలునాయక్
2. నేనావత్ కిషన్‌నాయక్
3. రవినాయక్
4. వడ్త్య రమేశ్‌నాయక్
5. నేనావత్ ప్రవల్లిక నాయక్
6. రమావత్ జగన్‌లాల్‌నాయక్
7. శ్రీరాముల జ్ఞానేశ్వర్
8. ఆంగోతు ప్రవీణ్‌నాయక్
9. కేతావత్ బీల్యానాయక్
10. మూడావత్ రేఖ్యానాయక్

సూర్యాపేట
1. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
2. పటేల్ రమేష్ రెడ్డి
3. తండు శ్రీనివాస్ యాదవ్
4. ముషం రవికుమార్
5. ఎలగందుల రాము
6. కుంట్ల మంజులారెడ్డి

తుంగతుర్తి
1. అద్దంకి దయాకర్
2. ఎన్ ప్రీతం
3. పిడమర్తి రవి
4. అన్నపర్తి జ్ఞానసుందర్
5. వడ్డేపల్లి రవి
6. భాషాపంగు భాస్కర్
7. పి.యుగేందర్
8. వల్లమల్ల జయకర్
9. పడిదల రవికుమార్
10. మమతానాగిరెడ్డి
11. ఇటికల చిరంజీవి
12. నూరారపు కృష్ణవేణి
13. నంది శ్రీహరి
14. గుడిపాటి నరసయ్య
15. గుండాల మురళీధర్
16. కందుకూరి అంబేద్కర్
17. పెండిగ కరుణ సాగర్
18. అనుములపూరి రవిబాబు
19. పంతం నరసయ్య
20. బి.మహేశ్వర్
21. రేణుకా నాగమల్లు
22. చింత మల్ల రమేష్
23. దోసపాటి విజయ కిషోర్

హుజూర్‌నగర్
1. ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
2. టి.నాగార్జున విద్యాసాగర్ చారి
3. సాముల జైపాల్‌రెడ్డి
4. సాముల శివారెడ్డి
5. పిల్లుట్ల రఘు
6. అన్నపురెడ్డి అప్పిరెడ్డి
7. అల్లం ప్రభాకర్‌రెడ్డి

కోదాడ
1. నలమాద పద్మావతిరెడ్డి
2. పందిరి నాగిరెడ్డి
3. సాముల జైపాల్‌రెడ్డి
4. అన్నపురెడ్డి అప్పిరెడ్డి
5. పి. వెంకటేశ్వర్లు

భువనగిరి
1. చెవిటి వెంకన్న యాదవ్
2. పోత్నక్ ప్రమోద్‌కుమార్
3. తంగళ్లపల్లి రవికుమార్
4. పున్న రామలింగం
5. వాకిటి అనంతరెడ్డి
6. బర్రె జహంగీర్
7. పంజాల రామాంజనేయులు గౌడ్
8. కసిరెడ్డి నారాయణరెడ్డి
9. పడాల శ్రీధర్‌రావు
10. పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్
11. పాక మల్లేశం యాదవ్

ఆలేరు
1. బీర్ల అయిలయ్య
2. బంద్రు శోభారాణి
3. బోరెడ్డి అయోధ్యరెడ్డి
4. జనగాం ఉపేందర్‌రెడ్డి
5. డాక్టర్ కుడుదుల నగేష్
6. కల్లూరి రాంచంద్రారెడ్డి
7. వంచా వీరారెడ్డి
8. డి.శంకర్‌నాయక్
9. కె.వెంకటేశ్వరరాజు
10. గంధమల్ల అశోక్
11. కానుగు బాలరాజు
12. కొంతం మోహన్‌రెడ్డి
13. మోకూ మధుసూదన్‌రెడ్డి
14. గుడిపాటి మధుసూదన్‌రెడ్డి
15. అండెం సంజీవరెడ్డి
16. ఎల్లంల సంజీవరెడ్డి
17. నీలం పద్మ

నల్లగొండ డీఏఓ సుచరిత బదిలీ

నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి వై.సుచరిత అకస్మికంగా బదిలీ అయ్యారు. ఆమెను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాయానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఏఓగా నల్లగొండ రెగ్యులర్ ఏడీ శ్రవణ్‌కుమార్‌కు బాధ్యతలను అప్పగించింది. మంగళవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. సుచరితను ఆకస్మికంగా బదిలీ చేయ డం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశం అయ్యింది.


బాధ్యతలను స్వీకరించిన శ్రవణ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం


హరీష్ (ఫైల్)

నాగారం : సూర్యాపేట–జనగాం జతీయ రహదారిపై ఫణిగిరి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారం మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన నడిపల్లి హరీష్ (22), ఉప్పుల శివ పల్సర్ బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన ఈటూరుకు బయలుదేరారు. మార్గమధ్యలో ఫణిగిరి స్టేజి సమీపంలోని సీఎస్‌ఐ చర్చి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న నడిపల్లి హరీష్ అక్కడికక్కడే మృతిచెందగా, వెనుక కూర్చున్న ఉప్పుల శివకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన శివను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. దీంతో సీఐ శివశంకర్, ఎస్‌ఐ జి.ముత్తయ్యలు కుటుంబ సభ్యులకు నచ్చ చెప్పి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

నేడు బీజేపీ నేత తరుణ్‌చుగ్ రాక

నల్లగొండ టూ టౌన్ : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ బుధవారం నల్లగొండకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమావేశంలో పార్టీ బలోపేతానికి మార్గనిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి


క్రీడాకారులకు సన్మానం చేస్తున్న కలెక్టర్

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రీడా పోటీల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ పేర్కొన్నారు. భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ క్రీడాదినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడాకారుల అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడలో అందించిన సేవలను కొనియాడారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సాధించి దేశ ప్రగతికి పాటుపడాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు జాతీయ క్రీడాకారులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, జెడ్పీ సీఈఓ ప్రేమేందర్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, కిరణ్‌కుమార్, వాసుదేవరావు, కరుణాకర్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ నగదు డ్రా చేసుకునేలా చూడాలి

నల్లగొండ : ప్రభుత్వం రుణమాఫీ కింద జిల్లాకు విడుదల చేసిన రూ.468 కోట్ల నిధులను సెప్టెంబర్ 15 లోగా రైతులు బ్యాంకులకు వెళ్లి విత్ డ్రా చేసుకునేలా వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు, ఉద్యాన శాఖ, బ్యాంకు మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణం రెన్యువల్ లేదా కొత్త పంట రుణం తీసుకునేలా చూడాలన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉన్నందున 86 వేల ఎకరాల్లో సాగు తగ్గిందని తెలిపారు. మండలాల వారీగా ఏ పంట వేస్తున్నారు విత్తనాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఏఓ శ్రావణ్, ఎల్‌డీఎం శ్రామిక్, డీఆర్‌డీఓ కాళిందిని, ఉద్యానశాఖ అధికారిణి సంగీతలక్ష్మి, మత్స్యశాఖ అధికారి వెంకయ్య ఉన్నారు.

రైతులకు అందుబాటులో ‘మేఘ్ దూత్’

- వాతావరణ సమాచారం సులభంగా తెలుసుకోవచ్చంటున్న శాస్త్రవేత్తలు


మేఘ్ దూత్ యాప్

త్రిపురారం : వాతావరణ సమాచారం సులభంగా తెలుసుకునేందుకు మేఘ్ దూత్ యాప్ అందుబాటులోకి వచ్చిందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. వాతావరణ శాఖ, వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా ఈ యాప్‌ని అందుబాటులోకి తెచ్చాయని పేర్కొన్నారు. మేఘ్ దూత్ మొబైల్ యాప్ ద్వారా గతంలో జరిగిన వాతావరణ పరిస్థితులతో పాటు రాబోయె ఐదు రోజుల్లో జరగబోయే పరిస్థితులను రైతులు ముందుగానే తెలుసుకుని పంటలకు రక్షణ చర్యలు చేపట్టవచ్చన్నారు. వాతావరణ పరిస్థితులతో పాటు ప్రధాన పంటల్లో రాబోయే చీడపీడలు, ప్రస్తుతం నెలకొన్న చీడపీడలకు నివారణ చర్యలు అందుబాటులో ఉంటాయన్నారు. మేఘ్ దూత్ యాప్ మంగళవారం, శుక్రవారాల్లో ఆగ్రో– మెట్ ఫీల్డ్ యూనిట్లు, జిల్లా ఆగ్రో– మెట్ ఫీల్డ్ యునిట్లు వివిధ పంటల సమాచారాన్ని అందిస్తాయని తెలిపారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి మేఘ్ దూత్(ఇంగ్లిష్‌లో) అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత సైన్‌అప్ పై క్లిక్ చేసి మీ పేరు ప్రాంతం ఫోన్ నంబర్, భాష, స్టేట్, జిల్లా నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. తిరిగి లాగిన్‌పై క్లిక్ చేసి ఫోన్ నంబర్ నమోదు చేసి లాగిన్‌పై క్లిక్ చేసి ఓపెన్ చేసుకోవాలి.